క్లుప్తంగా

చేనేత కార్మికులకు వేతనాల చెల్లింపు

● హర్షం వ్యక్తం చేసిన చేనేత కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న చేనేత కార్మికులకు ఎట్టకేలకు వేతనాలు అందాయి. సుమారు 2 నెలల 15 రోజుల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని చేనేత కార్మికులు సంఘం కార్యాలయం ఎదుట రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో 'పండుగ పూట పస్తులేనా..?' అనే శీర్షికన ఈ నెల 15న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన చేనేత సొసైటీ పాలకవర్గ సభ్యులు చేనేత కార్మికులకు 2 నెలల వేతనాలు చెల్లించారు. దీపావళి పండుగ ముందు వేతనాలు చెల్లించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఐనవోలు: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా వరంగల్ నగరానికి ఇసుక తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను ఐనవోలు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఆకేరు వాగు నుంచి అక్రమంగా సింగారం గ్రామం గుండా వరంగల్ పట్టణానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 11 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే భారీ పెనాల్టీతోపాటు కఠినచర్యలు ఉంటాయని ఎస్సై పస్తం శ్రీనివాస్ హెచ్చరించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట: మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ మారెపల్లి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 1999–2000 విద్యాసంవత్సరంలో బాబుతో పాటు పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఆదివారం బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.13,500 అందజేశారు. కార్యక్రమంలో ఎంశెట్టి సురేందర్, సామల రామకృష్ణ, కందగట్ల సంతోష్, మార్త సుమన్, బాసాని భాస్కర్, కందగట్ల మహేష్, పోలబోయిన రాజేందర్, నల్లెల ఈదేందర్, మాదారపు సూర్యప్రకాశ్, ప్రదీప్, శ్రీను, భిక్షపతి తదితరులు ఉన్నారు.

నివాళి



పరకాల: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి తల్లి రేగూరి రంగమ్మ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతిచెందిన రంగమ్మ దశ దినకర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా చల్లా ధర్మారెడ్డితోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

ఘనంగా గార్మీ షరీఫ్ పండుగ



ఆత్మకూరు : మండల కేంద్రంలో ముస్లింలు ఆదివారం జామా మసీదు ఆధ్వర్యంలో గార్మీ షరీఫ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో జెండా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో బహదూర్, ఫసి, యూసుఫ్, అంకూస్,అక్బర్, ఖలీద్, పాషా, చాంద్, మూసాద్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ ఆత్మకూరు గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, నత్తి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ జర జాగ్రత్త

పరకాల: దీపావళి రోజు సైతం 24గంటల పాటు ప్రజలకు సేవచేయడమే లక్ష్యంగా 108 సిబ్బంది అందుబాటులో ఉంటారని.. ఏదైనా ప్రమాదం జరిగితే 108 సేవలు వినియోగించుకోవాలని 108 ప్రాజెక్ట్ తెలంగాణ సీఈఓ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి పండుగను ప్రజలంతా కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బాణసంచా కాల్చే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని తెలిపారు.

నిధులు లేక నిలిచిన పనులు

● అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం
● నాలుగేళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం

వేలేరు: మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం ఏండ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదని వేలేరు మండల దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో సభలు, సమావేశాల నిర్వహణకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లు, స్లాబ్, సగం వరకు గోడలు కట్టి బిల్లులు రావడం లేదని అసంపూర్తిగానే వదిలేశాడు. అప్పటి నుంచి నేటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా పనులు నిలిచిపోయాయి. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితంలేకుండాపోయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు

● పట్టించుకోని సిబ్బంది
● పండుగ పూట నీటి కొరత తప్పదేమోనని ప్రజల ఆందోళన



గ్రామ శివారులోని భగీరథ తాగునీటి ట్యాంకు



వృథాగా పోతున్న నీరు

శాయంపేట : ప్రజల దాహార్తిని తీర్చేందుకు నీటి నిలవ్వకోసం మండల కేంద్రంలో భగీరథ పథకంలో భాగంగా నీటి ట్యాంకును నిర్మించారు. ప్రధానంగా ఈ ట్యాంకు ద్వారా మండల కేంద్రం శివారులో దళిత కాలనీకి నీటి సరఫరా చేస్తుంటారు. అయితే కొన్ని కొన్నినెలలుగా ట్యాంకు పర్యవేక్షణను గాలికొదిలేశారు. దీంతో నీటితో నింపేక్రమంలో పట్టించుకునేవారు లేక ట్యాంకు నిండిన అనంతరం ఆఫ్ చేయకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. ఆపరేటర్ సమయపాలను పాటించకపోవడంతోనే నీరు వృథగాపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యమే.. వృక్షమైంది



మరుగుదొడ్ల మధ్య పెరిగిన చెట్టు

వేలేరు: మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం పక్కనున్న మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దానికి తోడు మరుగుదొడ్ల మధ్యలో వృక్షం పెరిగింది. ఇప్పటికే అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లలో చెట్లు పెరగడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లను తొలగించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

● ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్ : ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని, ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పక్కగా అమలు చేయాలని ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ హంటర్ రోడ్డు ఓపెన్ బిర్లా మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఓసీ ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, దుబ్బ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన అగ్రకుల పేదల ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ అన్ని కులాలకు రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు ఇచ్చిన ఏడున్నర దశాబ్దాలకు పైగా అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను సదస్సు ముందు ఉంచగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో రాయపాటి వెంకటేశ్వర్‌రావు, రామారావు, సంజీవరెడ్డి, వేణుగోపాల్, వంగేటి అశోక్, పాపారావు, నర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, 600 మంది ఓసీలు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీపార్వతీ దేవి సమేత మహాదేవ స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. అర్చకులు శ్రావణ్ శర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

అన్న చెంతకు చెల్లెలి మృతదేహం

● తండ్రి మృతిచెందిన ఐదురోజులకే కుమార్తె మృతి
● దశదినకర్మ పూర్తికాకపోవడంతో చెల్లెలి మృతదేహాన్ని అన్నవద్దకు తీసుకెళ్లిన వైనం



కల్పన మృతదేహాన్ని చూసి విలపిస్తున్న అన్న

ఐనవోలు: అన్న కడసారి చూపుకోసం చెల్లెలి మృతదేహాన్ని అన్న దగ్గరికి తీసుకొచ్చిన ఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పున్నేలు గ్రామానికి చెందిన చెవ్వ కొమ్మాలు(70) ఈ నెల 14న అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. కొమ్మాలుకు కుమారుడు చెవ్వ లోకేశ్వర్, నలుగురు కూతుర్లు చెన్నబోయిన శోభ, బోడ అరుణ, సింగసాని కరుణ, బైరబోయిన కల్పన(40)లు ఉన్నారు. అందరికీ వివాహం అయింది. కొమ్మాలు మృతి విషయం తెలుసుకున్న కూతుర్లు పున్నేలు చేరుకుని ఐదు రోజులుగా ఇక్కడే ఉన్నారు. శనివారం 5వ రోజు కార్యక్రమాలు ముగిసిన అనంతరం బైరబోయిన కల్పన రెండు మూడు రోజుల తర్వాత వస్తానని చెప్పి ప్రస్తుతం వారు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. అయితే ఆదివారం కల్పనకు బీపీ డౌన్ కాగా ఆస్పత్రిలో చేరి గుండెపోటుతో మృతిచెందింది. దీంతో అంత్యక్రియల నిమిత్తం కల్పన మృతదేహాన్ని నర్సంపేట మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో సంప్రదాయం ప్రకారం తండ్రి దశదిన కర్మ పూర్తికాకముందు కొరివి పెట్టిన కుమారుడు లోకేశ్వర్.. చెల్లెలు గ్రామానికి వెళ్లి కడసారి చూసుకునే అవకాశం లేదు. దీంతో చెల్లెలు కల్పన మృతదేహాన్ని మార్గమధ్యలో ఉన్న తల్లిగారి గ్రామమైన ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు కారులో తీసుకొచ్చి అన్నకు చూపించారు. చెల్లెలి మృతదేహాన్ని చూసిన అన్న కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కంట తడిపెట్టించింది. అనంతరం కల్పన మృతదేహాన్ని నర్సంపేటకు తరలించారు.



కల్పన(ఫైల్)

గాంధీనగర్‌లో నరకాసుర వధ

హన్మకొండ : హనుకొండ గాంధీనగర్‌లో దీపావళి వేడుకల్లో భాగంగా ఆదివారం నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణ ధరించిన పిల్లలు నరకాసురుని వధించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి గెలిచిన రోజుగా దీపావళి జరుపుకుంటామన్నారు. గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదానం

నయీంనగర్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ, హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప ఉత్తర నక్షత్రం సందర్భంగా కేయూ జంక్షన్‌లో ఆదివారం అన్నదా నం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నా యిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. అయ్యప్ప భక్తులు ఇంత మంచి కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, సంతోష్ కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, బాలరాజ్, అజయ్‌కుమార్, భాస్కర్, సాగర్, నరేందర్, జితేందర్ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో దీపావళి సంబురాలు



బాణసంచా కాల్చుతున్న అనితారెడ్డి, తదితరులు

హన్మకొండ/విద్యారణ్యపురి : హనుమకొండలోని స్వధార్ ఆశ్రమం, అర్ఫన్ డిప్రవడ్ అనాథ పిల్లల ఆశ్రమం, స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో, యూనివర్సిటీ సమీపంలోని లార్డు వృద్ధాశ్రమంలో ఆదివారం అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు కరుకాల అనితారెడ్డి ఆధ్వర్యంలో దీపావళి సంబురాలు జరుపుకున్నారు. పిల్లలతో బాణసంచా కాల్పించారు. మిఠాయిలు పంచారు. అన్ని కోల్పోయి జీవితంలో చివరి దశకు చేరిన వృద్ధులకు పండుగ సంతోషాన్ని పంచేందుకు ఇక్కడ దీపావళి బాణసంచాను అందించామని తెలిపారు. కార్యక్రమంలో కరుకాల ఆర్వికారెడ్డి, శైలజ, ప్రసన్న కుమార్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

గీతకు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ విభాగం పరిశోధకురాలు కె.గీతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ ఇన్ తెలంగాణ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గీతకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు.

ఏకశిల పార్కులో అభివృద్ధి పనులు

హన్మకొండ : హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.5 లక్షల నిధులతో పార్క్‌కు తూర్పు వైపు ఐరన్ గేట్, యోగా షెడ్, జిమ్ములో కంకర, పిల్లల ఆటస్థలంలో ఇసుక, ఆర్చ్ వద్ద ఎర్రమట్టి పోసి మొక్కలు నాటడం పనులకు ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు. ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

గుంత.. చింత !



వేలేరు: మండలంలోని పీచర అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుపై గుంత ప్రమాదకరంగా ఉంది. ఈ దారి వెంట రాకపోకలు సాగించే కాలనీ వాసులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

● బొట్ల చక్రపాణి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న హమాలీ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆదివారం పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆవిష్కరించిన అనంతరం చక్రపాణి మాట్లాడారు. హమాలీ కార్మికులు చేస్తున్న ఎగుమతులతో ప్రభుత్వానికి సెస్‌ల రూపంలో కోట్ల రూపాయాలు ఆదాయం వస్తున్నా హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పైసా ఖర్చు పెట్టకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, పనిభద్రత కోసం ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్ష, కార్యదర్శులు తిక్కల కమల్, బొచ్చు ఆదాం, గుర్రం భిక్షపతి, మేకల రాజు, మేకల రమేష్, పెండ్యాల రమేష్, తిరుపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



విజయకేతనం చూపిస్తున్న పోలీస్, ప్రెస్ టీంలు

వేలేరు: మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం పోలీస్ టీం, ప్రెస్ టీం మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 40 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రెస్ టీం 7 ఓవర్లలోనే 41 పరుగులు చేసి విజయం సాధించింది. అలాగే మరో మ్యాచ్‌లో ప్రెస్ టీంపై పోలీసు టీం విజయం సాధించింది. ఈసందర్భంగా వేలేరు ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసే పోలీసులు, ప్రెస్‌కి మధ్య సత్సంబంధాలు ఉండేందుకే ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించినట్లు తెలిపారు.

కళాకారులతో సమాజంలో చైతన్యం

● సోదా రామకృష్ణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

పరకాల: సమాజాన్ని చైతన్య పర్చే శక్తివంతులు గ్రామీణ కళాకారులని అలాంటి రచయితలు, గాయకులను ప్రోత్సహించడం ద్వారా దేశ భవిష్యత్‌కు దోహదపడినట్లు అవుతుందని వాల్మీకి యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోదా రామకృష్ణ అన్నారు. పరకాల అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం చెర్రీ డ్యాన్స్ అఫీషియల్ షార్ట్ ఫిలిం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'చిన్న చిన్నగా..' అంటూ సాగే ఓ పాట వాల్ పోస్టర్‌ను సోదా రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ ఏకు రాజు, కాంగ్రెస్ నాయకులు నల్లెల అనిల్‌కుమార్, ఏకు రఘుపతి, బొచ్చు అనిల్ తదితరుల పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



వెంకటమ్మ మృతదేహం

శాయంపేట: మండలంలోని మాందారిపేట గుట్టల్లో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లె గ్రామానికి చెందిన కొమరగిరి వెంకటమ్మ (40) కూలి పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తుండేది. వెంకటమ్మకు జ్వరం రావడంతో శనివారం రేగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లినట్లు కుమారుడు కుమారస్వామికి తెలిపింది. కానీ, రాత్రి వరకు వెంకటమ్మ ఇంటికి రాకపోవడంతో కుమారస్వామి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కుమారస్వామి ఆదివారం గోరి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంకటమ్మ ఫోన్ నంబర్‌తో లొకేషన్ ట్రేస్ చేసి మండలంలోని మాందారిపేట గుట్టల వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా.. వెంకటమ్మ వెంకటమ్మ అప్పటికే మృతి చెంది కన్పించింది. ముక్కు నుంచి తెల్లటి నురగ రావడంతో క్రిమిసంహారక మందుతాగి మృతి చెందినట్లు గుర్తించారు. వెంకటమ్మ కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

విద్యారణ్యపురి : రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని మానసికంగా క్షోభకు గురవుతున్నారని మానవీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ బకాయిలసాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించాలని ప్రాణాలు కాపాడాలన్నారు. అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి దేవదాస్, బాధ్యులు ఎండీ. మహబూబ్ అలీ, దామోదర్, ఆర్‌వీ చలం, ఇంద్రసేనారెడ్డి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు..

● ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ : విద్యతోనే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నా రు. ఆదివారం ఎన్జీఓస్ కాలనీ రోడ్ శ్రీనగర్ కాలనీలోని కేఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థులు ఉన్నత చదువు చదివేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 23 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఆరుగురికి నగదు బహుమతి, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్, ప్రచార కార్యదర్శి శ్రీరామోజు రాజ్‌కుమార్, కోశాధికారి వలబోజు కేశవరావు, ప్రతినిధులు దాసోజు గోవర్ధనాచారి, శ్రీనివాస్, డాక్టర్ సురేందర్, వెంకటరమణ, సురేష్ బాబు, భిక్షపతి, సదానంద చారి, నరసింహచారి, శ్రీధర్, దేవేందర్, తంగళ్లపల్లి జయసేన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.